# నల్లంచు తెల్లచీర

"చచ్చిన శవంలా అలా పడుకోక్కపో పోతే కాస్త యాక్టివ్‌గా లేచికూర్చో రాదూ?" అంది అరుణ యశోదతో, మాటలతో పొడుస్తూ.

"ఆవిడగారు చచ్చినశవం ఎందుకైందీ? విరహంలో శకుంతల్లా పోజు పెడితే!" పోటు ఎక్కువ చేసింది శారద.

"నా యిష్టం! కావాలంటే. ప్రేమలో పడ్డ శకుంతల్లా పాటలు పాడుకుంటా! మీ రెవరు ఆక్షేపించడానికి?" అని తిరగబడింది శవంలాంటి, విరహంలోని శకుంతలా వురఫ్ యశోద.


"కావాలంటే ప్రసవించే శకుంతల్లా పిచ్చికేకలెయ్యి! ఎవరొద్దన్నారు?" మరీ రెచ్చగొట్టింది అరుణ.

"ఇందాకట్నుంచీ చూస్తున్నా. ఎందుకమ్మా యీ ఒక్కరోజు భాగ్యానికి అలా కరుచుకుంటారు?" సర్ది చెప్పింది రెక్కలూ, ఆలివ్‌కొమ్మా లేని శాంతిదూతలా సుందరం.

సుందరం మాటలకి అంతకుముందు అరగంటపైగా జరుగుతున్న అనధికార యుద్ధం ఆగింది. సుందరానికి తెలుసు వాళ్ళలా ఎందుకు గొంతులు చించుకుంటున్నారో.

వాళ్లు నలుగురూ ప్రాణస్నేహితులు. నాలుగు వేర్వేరు ఊళ్ళనుండి వచ్చి, స్వదేశ్ వుమెన్స్ కాలేజీలో చదివి, ది సయామీస్ క్వాడ్రుప్లెట్స్ (The Siamese quadruplets) అని పేరు తెచ్చుకుని, ఒకర్నొకరు జీవితంలో విడవకుండా వుందామన్న ఆశ, ఏను కక్కైదుపే నేటితో పగిలిపోతుందని గ్రహించేక, వాళ్ళ మనసుల నైర్మల్యం కలతపడి, ప్రతి చిన్నవిషయానికీ దెబ్బలాడుకో నారంభించేరు. వాళ్ళ పరీక్షలు ఐపోయేయి. అంతా బాలాబాగా రాశేరు. ఒకర్నుంచి ఒకరు దూరమైపోతున్నామన్న బెంగా, యిక బహుశా జీవితంలో కలుసుకోలేమేమో నన్న బాధా వారి హృదయాల్ని ఇనపచేతుల్తో పిండి

బీనాదేవి



చేస్తున్నాయి. వా రెవరి మధ్యా ఎటువంటి అరమరికా, భేదం ఎన్నడూలేదు. ఇతరులని ప్రేమించ గల సుహృద్భావం, త మ హక్కులు మరచిపోగల టేక్ట్ (Tact), మరొకరి బలహీనతలఎడ సానుభూతీ అందరికీ వుండడంవల్ల వారి మధ్య స్నేహం జీవితాంతర బంధంగా నిలచిపోయింది.

నలుగురూ అందగత్తెలే. నల్లబ్లాక్ బోర్డుమీద నాలుగు వివిధ రంగుల సుద్ద ముక్కలతో గీసిన గీతల్లా ఎవరి అందం వారి కుంది. నలుగురూ కలుసుకున్నప్పుడు ప్రతి ఒక్కరూ మరీ అందంగా కన్పిస్తారు.

ముగ్గురూ బాగా కలవారి బిడ్డలే. సవతితల్లులూ, టి. బీ. అన్నయ్యలూ, పేచురుగొట్టు తండ్రులూ ఎవరికీ లేరు. జీవితంలోని బాధలు తెలియకుండా, జీవిత సాగరంలో అలలమీద నాట్యం చేస్తూ జీవితమంటే ఒక రాకెండ్ రోల్ పాటగా యింతవరకూ గడిపేశారు.

రేపే ఎవరివూళ్ళకి వాళ్ళు వెళ్ళి పోవాలి. అంచేత ఆ సాయంత్రం బీచిలో సముద్రాన్ని ఆఖరిసారిగా చూస్తూ కొంత సేపు కూర్చుని, సినీమా కెళ్ళి, హాస్టలికి లేటుగా రావటానికి పూర్తి ముక్కున్న తాటకిలాంటి ఆడవార్డెన్ పెర్మిషను పొంది బైల్దేరబోతూవుంటే యీవేళ "శకుంతల చీర" నాది అంది యశోద సుందరంతో.

సుందరం అంతకుముందు నెలనాడు నల్లంచు తెల్లనూలుచీర కొనుక్కుంది. కాటుక వాలు కన్నులా, నల్లగీత మబ్బులో యిరుక్కున్న చంద్రుడిలా వున్న ఆ చీర అందరికీ ప్రాణమై పోయింది. మళ్ళీ అలాంటి చీరలు కొనుక్కుందామని మిగతా ముగ్గురూ ప్రయత్నించినా దొరకలేదు. కొన్నినాడే దాన్ని యశోద కట్టుకొని తామరపువ్వంత గులాబీపువ్వు చేత్తో పట్టుకొని ఏదో రాసుకుంటూంటే "అచ్చు శకుంతల్లా వున్నా" వంది సుందరం. నాటి నుండీ ఆ చీరకి శకుంతల చీరన్న పేరొచ్చేసింది.

* * *

ఆవేళ ఆచీర కట్టుకుందామని మిగతా ముగ్గిరికీ బలమైన కోరిక వున్నా, యశోదే, తన కోరిక ముందు ప్రకటించడం మూలంగా, దాన్ని కట్టుకునే హక్కు సంపాదించుకొంది

బీచికి రాగానే యశోద చీర నలక్కుండా పక్కగా తిరిగి పడుక్కొంది. ఎడమచేయి మడతపెట్టి, అరచేతికి చెంప ఆనించి, సముద్రంలోకి దూరంగా చూస్తూవుంటే, వాళ్ళ సంభాషణలోకి శవాలూ, శకుంతల్లూ వచ్చేయి.

శాంతి స్థాపించేక సుందరమే మళ్ళీ సంభాషణ ప్రారంభించింది. "యీ డిగ్రీ కోర్సయ్యేక ఏం చేద్దా వంటారు?"

"ఎమ్మెస్సీ చదివి అఖిలాంధ్ర ఆడపిల్లల ట్యుటోరియల్ కాలేజీ పెడదాము," అంది యశోద.

"లేకపోతే పెళ్ళిళ్ళు చేసుకొని అఖిలాంధ్ర పిల్లల్తల్లుల కాంపిటిషనైనా సరే!" కొత్త దెబ్బలాటకి పునాదు లేసింది అరుణ.

"వద్దంటే మాత్రం పెళ్ళాడక తప్పుతుందా?" న్యాయసమ్మతమైన సందేహం వెలిబుచ్చింది శారద.

"అలా ఐతే అడుగో వాణ్ణి ఎవరో ఒకరు పెళ్ళాడెయ్యండి" అంది సుందరం. ఓమవేపు, కలల్లో తేలిపోతున్న, కవిలావస్తున్న సుబ్రమణ్యాన్ని చూపిస్తూ. పెళ్ళికాని అసిస్టెంటింజనీరు సుబ్రమణ్యం

అంతకు రెండునెలల ముందే అక్కడికి దగ్గర్లో వున్న మరోవూరు పోష్టయ్యేడు.

"మీ రూముకు వెళ్తే మీ శిలా వచ్చే రనితెలిసొచ్చా:'' క్షమార్పణ చెప్తున్నట్టు అన్నాడు సుబ్రమణ్యం సుందరంతో వాళ్ళదగ్గర కొచ్చాక.

"అబద్ధాలాడలేని అసిస్టెంటింజనీరు–కాంక్రీటులో కవిత్వం చెప్పేకవి – మా అన్న." అంటూ పరిచయాలు పూర్తి చేసింది సుందరం.

యశోద కెదురుగా, సుందరానికి పక్కగా కూర్చున్నాడు సుబ్రమణ్యం. సుబ్రమణ్యంకి, ఎవరేనా మాట్లాడితే అడ్డురాకుండా కాశ్మీరు సమస్య కారణాల దగ్గర్నుంచి కరక్కాయ ఔషధ గుణాల వరకూ వినగల ఓర్పూ, ఎవరూ ఏదీ మాట్లాడకపోతే జర్మనుబాలే విశిష్టత దగ్గర్నుంచి జంగం బుల్లెమ్మ శీలం వరకూ తెలివిగా మాట్లాడగల నేర్పూ వున్నాయి. అంచేత ఏ కంపెనీలోనైనా అతను షైనవుతాడు. ఆడవాళ్ళు నలుగురూ ఏదీ మాట్లాడకపోవడం కని పెట్టి సుబ్రమణ్యమే చాలా విషయాలు మాట్లాడేడు. అతను యశోద కెదురుగా కూర్చోవడం వల్లనైతే నేమి, ఏదో విషయం మాట్లాడి 'మీ రేమంటారు?' అని అన్నప్పుడు యశోద వేపు సూటిగా చూడ్డంవల్లనైతే నేమి. ఆమె అతడి నెక్కువగా ఆదరించిందని ఆమెతో సహా అంతా ఫీలయ్యారు.

యాలోగా కన్నెపిల్ల మనసులోని కోర్కెలా నిండుగా లేచేడు చంద్రుడు. పదిమందిని ఒక్కసారి ప్రేమించి, ఎవర్ని ఫైనల్‌గా ఎన్నుకోవడమో తెలియని కాలేజీ పిల్ల మనసులా ఆరాటపడ సాగింది సముద్రం.

చిరకాలానికి ప్రియుడ్ని చూడగలిగిన ప్రియురాలి హృదయంలా ఒక్కొక్కరి చెట్లాకులు టపటప కొట్టుకున్నాయి.

చుక్కల కళ్ళ దిష్టి తగలకుండా నన్నట్టు ఒక పల్చని మేఘం చంద్రుణ్ణి కప్పేసింది. కాని అందులో నుంచే సందుచేసుకొని చూస్తున్నాడు చంద్రుడు.

సుబ్రమణ్యం మొహంమీద వెన్నెల పడకపోయినా అతని చూపుల్లతలు తనని చుట్టుకుంటున్నట్టు ఫీలైంది యశోద. అతని చూపులు పెంపుడు కుక్క ప్రేమతో కరిచినట్టు సూదిగానూ, అతి మెత్తగానూ వున్నాయి

"మేమంతా సినీమాకి పోదామనుకున్నా మన్నయ్యా. నువ్వుకూడా రారాదూ?'' అని ఆహ్వానించింది సుందరం.

"అందులో హీరో ఏడవడంటే తప్పకుండా వస్తా," అన్నాడు సుబ్రమణ్యం నవ్వుతూ లేచి.

*   *   *

సినిమా యింటర్వెల్లులో "యిందులో హీరోకి ఏడుపే కాదు విచిక్కి పాటలు కూడా వుండేట్లున్నాయ్,'' అని అత నన్న మాటలకి మిగతావా

ళ్ళంతా గొల్లుమన్నారు. సినిమా తర్వాత హోస్టలు దగ్గర వాళ్ళని దింపేక" అన్నట్టు చెప్పడం మరచిపోయాను; నాకు కొద్ది రోజుల్లో ట్రాన్సఫరై పోవచ్చు." అన్నాడు సుబ్రమణ్యం.

"అప్పుడేనా!" ఆశ్చర్యపోయింది సుందరం.

"అంతా ఏవో పోలిటిక్సులే!" సమాధానం చెప్పేడు.

"ఏ ఊరౌతుందో?" మళ్ళా సుందరమే ప్రశ్నించింది.

"ఉన్న ఊరొదిలేస్తే ఏవూరైనా సరే యిస్తామంటున్నారు." క్షణం నిశ్శబ్దం.

"ఏవూరు వేయించుకోమంటావ్?"

"ఏమో! నీ యిష్టం. మనూరెలాగా యివ్వరు కదా!"

పోనీ వీళ్ళ వూళ్ళల్లో దేన్నైనా కోరుకో. ఈమెది కాకినాడ; యీమెది విజయవాడ; యీమెది ఏలూరు.

"ఏ వూరు వేయించుకుంటారు?" అన్న ప్రశ్న మూడు మనస్సుల్లో ఉవ్వెత్తున లేచి ఆలాగే అవ్యక్తంగా వుండిపోయింది.


* * *

"......అన్నట్టు, మా అన్నకు మీవూరే ట్రాన్స్‌ఫరైందిట. త్వరలో వచ్చి చార్జీ తీసుకుంటాడు. అతన్ని మీ యింటికి ఆహ్వానించమని సలహా యివ్వనక్కర్లేదనుకుంటాను..." సుందరం రాసిన వుత్తరం అక్కడితో కొంతసేపు చదవడం మానేసింది యశోద. సుబ్రమణ్యం నిజంగా తనూరు కోరుకొనే వేయించుకున్నాడా? ఐతే దేనికోసం? తనకోసమా? అసంభవం. తనలో వున్న ప్రత్యేక తేమిటి? కాని మొదట చూసినప్పుడే తనని ప్రత్యేకించి గుర్తించాడే? ఎంచేత? ఏమిటి తన ఆధిక్యత? తనకంటె అరుణా, శారదా అందంలోగాని, చదువులోగాని, డబ్బులోగాని ఎంతమాత్రం తీసిపోరు. డబ్బుగురించి, చదువుగురించి సుబ్రమణ్యానికి తెలియకపోవచ్చు. కాని ఏమి చూసి తనని ఎన్నుకున్నాడతను? జవాబు తెలుసుకోడానికి తహతహలాడింది. ఆమె క్యూరియాసిటీ పూర్తిగా రౌజ్ అయింది.

* * *

ఇంగ్లీషు సినిమాలో హఠాత్తుగా హీరోయిన్ని చెంపదెబ్బ కొట్టి హీరో ముద్దుపెట్టుకున్నట్టు అకస్మాత్తుగా యశోదా సుబ్రమణ్యాలపెళ్ళి నిశ్చయమైపోయింది.

"హార్టీ కంగ్రాట్యులేషన్స్... యింతకీ నే నోటి అడుగుతా చెప్తావా? నిన్ను చూసినదగ్గర్నుంచీ నీ కొంగే పట్టుకు ఎందుకు తిరుగుతున్నాడమ్మా నీ క్కాబోయే ఆయన!" ధారాళంగా అడిగేసింది యశోదని శారద, పెళ్ళికి వచ్చినప్పుడు.




"ఏమో నాకు తెలీదు," ముద్దబంతి జవాబు చెప్పింది యశోద.

"ఆమాత్రం అడక్కుండా వుంటావా అయన్ని? పోన్లేమ్మా మాకు చెప్పక్కర్లేదులే," అరుణ సంభాషణ తుంచేసింది.

* * *

పెళ్ళి దివ్యంగా జరిగిపోయింది. పన్నెండు హనీమూన్లలా తిరిగిపోయింది సంవత్సరం యశోదకి కలిగిన ప్రతీ కోరికా తీర్చాడు సుబ్రమణ్యం.

ఇంద్రధనస్సు వంచి చీరెలు చింపించేడామెకి.

ఉదయారుణ కాంతిలో గడ్డిపోచ చివర మెరిసే వజ్రాన్ని రాపించి ఉంగరము చేయించేడు.

పన్నీటి సరస్సులో గులాబీరేకుల్లో బోటుషికార్లు తిప్పేడు.

తెల్ల మేఘాల పరుపులు కుట్టించేడు.

ఇవన్నీ చాలవేమోనని —

నెలకో బెనారసు చీర కొన్నాడు.

అసలు వజ్రాల ఉంగరాలు కొన్నాడు.

గులాబీబోటు కాకపోయినా, ఆమె పెదాలంత ఎర్రగావున్న కారు కొన్నాడు.

ఇన్నున్నా ఆమె ఏదో కొరత ఫీలౌతూ వుండేది. దానిక్కారణం ఆమెని మొదట్నించీ వేధిస్తున్న ప్రశ్న. ఇంతవరకూ ఆమెని సిగ్గు, సుబ్రమ

జ్యాన్ని ఆ ప్రశ్న వెయ్యనివ్వలేదు.

ఆనాడు వారి పెళ్లై సమంగా సంవత్సరం. నేడన్నా ఆ ప్రశ్నకు జవాబు తెలుసుకోవాలి.

ఆవేశ అడిగేసింది - "నే నొకటి అడుగుతా చెప్తారా!"

"ఓ!"

"మీరు మొదట్నించీ నన్ను..."

"ప్రేమించేను. లవెట్ ఫస్ట్ సైట్."

"అది కాదండీ..."

"నే నిదివర కెవర్నైనా ప్రేమించేనా? నీతోడు."

"మీతో సాగలేం..."

"మీ అమ్మతోడు."

"బాబ్బాబు! ఒక్క క్షణం మాట్లాడనీయండీ."

"............"

"మీరు నన్ను మొదట్నించీ అందర్లాగా చూళ్లేదు కదూ?"

నిన్నంతా ఎలా చూస్తారో తెలీదు కాని, నేను చూసినట్టు చూస్తే మాత్రం చంపేస్తాను."

"నన్ను..."

"నిన్నుకాదు. 'అంతా'ని."

"అది కాదండీ ... అంటే ... ఐమీన్ ... మమ్మల్ని మొదట మీరు చూసినప్పుడే నన్ను ప్రత్యేకంగా ... అంటే ఊగతావా శ్రద్ధర్ని చూసినట్లు కాకుండా... స్పెషల్గా చూశారు కదూ?"

"నేరం ఒప్పుకుంటున్నాడు ముద్దాయి."

"ఎంచేత?"

"ఖూనీ ఒప్పుకున్నవాణ్ని ఉరితీసి పంపించేస్తారు కాని కారణా లడగరు."

"అది కాదండీ; సరదా కడుగుతున్నా."

"............"

"అప్పుడు నాలో ఏది మిమ్మల్ని ఆకర్షించింది?"

"............"

"చెప్పండీ!" బతిమాలింది.

"............"

"బాబ్బాబూ" బుజ్జగించింది.

"నీ నల్లంచు తెల్లచీర..."